సాక్షి
వనపర్తి

బుధవారం, 1, ఫిబ్రవరి, 2023



కొను'గోల్‌మాల్'..!

గండేడ్ మండలంలో ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వివరాలు 10లో ▸



వేంకటేశా.. నమోస్తుతే

మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.1 /18.3

వాతావరణం

ఉదయం, రాత్రి సమయాల్లో చలి ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం పాక్షికంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు

అమరచింత: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు ఇవ్వడం జరుగుతుందని డీఐఓ డాక్టర్ పుష్పలత, డీపీఓ సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని మస్తీపురంలో కంటి వైద్య శిబిరాన్ని వారు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు శిబిరాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని, ఎంతో విలువైన సాంకేతికతో కూడిన మిషన్ ద్వార కంటి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో గ్రామాన్ని ఒక్కో యూనిట్‌గా తీసుకొని 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహిస్తు గ్రామం మొత్తంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నిత్యం శిబిరాల పనితీరును పరిశీలించడానికి జిల్లా అధికారులు ఆకస్మికక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మస్తీపురంలో నాలుగో రోజు180 మంది కంటి పరీక్షలు నిర్వహించుకోగా 24మందికి కంటి అద్దాలను అందించామని, మరో 12 మందికి శస్త్రచికిత్సకోసం సిపార్సు చేసినట్లు వైద్యదికారి డాక్టర్ దీపిక తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, హెల్త్ సుపర్ వైజర్ సురేందర్ గౌడ్, గోపాల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేద్దామని, అందుకు ప్రతి కార్యకర్త నడుంకట్టాలని మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రావర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ, జిల్లా ఇన్‌చార్జ్ బోపన్‌పల్లి ప్రతాప్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రజల ప్రగతి ఫలాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలోనూ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ, కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య, అర్హులైన వారందరికి డబుల్ బెడ్రూం ఇళ్లు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీనువాసులుగౌడు, శ్రీనువాసులురెడ్డి, గోపినాయక్, రామన్‌గౌడు, మాదవరెడ్డి, అనుజ్ఞారెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలి

ఖిల్లాఘనపురం: జిల్లాలోని 50 ఏండ్లు నిండిన ప్రతి గీత కార్మికుని పరభుత్వం పింఛన్ ఇవ్వాలని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు బండారు శ్రీనువాసులుగౌడ్, జై గౌడ సంఘం అధ్యక్షుడు పలుస శ్రీనువాసులుగౌడ్ అన్నారు. మంగళవారం షాపురంలో అన్ని గ్రామాల్లో నూతనంగా ఎంపికైన గౌడ సంఘం గ్రామ అధ్యక్షులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి మండలంలో గౌడ సంఘం సమావేశ భవనం నిర్మించాలని, గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఇవ్వాలని, పేద కుటుంబాలకు గౌడ బంధును మంజూరు చేయాలన్నారు. సర్పంచు బాలాంజనేయులుగౌడు, మండల సంఘం అధ్యక్షుడు గోద అంజనేయులుగౌడు, కృష్ణయ్యగౌడు, మన్నెంగౌడు, నాగేంద్రంగౌడు, మాసయ్యగౌడు, శ్రీనువాస్‌గౌడు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారుల బదిలీ



యాస్మిన్‌బాషా.. తనదైన ముద్ర

వనపర్తి కలెక్టర్‌గా షేక్ యాస్మిన్ బాషా దాదాపు మూడేళ్లు పని చేశారు. గ్రూప్–1 ఆఫీసర్‌గా సంగారెడ్డిలో పని చేసిన ఆమె 2015లో కన్ఫర్మ్‌డ్ ఐఏఎస్‌గా గుర్తింపు పొంది సిరిసిల్ల జాయింట్ కలెక్టర్‌గా 2020 ఫిబ్రవరి వరకు పనిచేశారు. తర్వాత వనపర్తి జిల్లా కలెక్టర్ 2020 ఫిబ్రవరి 3న బాధ్యతలు చేపట్టారు. కరోనా సమయంలో జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలతో మొదటి నెల **రోజుల పాటు గ్రీన్‌జోన్‌లో ఉండేలా చర్యలు తీసుకున్నారు. సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం, నూతన మెడికల్ కాలేజీ, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ, వ్యవసాయ మహిళా రెసిడె**న్షియల్ కాలేజీ లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలను ఎస్టిబిలేషన్ చేయటంలో కీలకంగా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా మంత్రికి పూర్తి స్థాయిలో సహకరిస్తూ.. జిల్లా పాలన తనదైన ముద్ర వేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతరం పురం వాసి అయిన యాస్మిన్‌బాషా గత కొంత కాలం క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆమెను వనపర్తి నుంచి కుమురంభీం అసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేయటంతో ఆమె కొంత నిర్వేదానికి గురైనట్లు తెలుస్తోంది.



పవార్.. రెండున్నరేళ్లుగా..

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాకు చెందిన తేజస్ నందులాల్ పవార్ అదే జిల్లాలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. 2018కి చెందిన ఐఏఎస్ అధికారి కాగా.. కామారెడ్డి జిల్లాలో శిక్షణ తీసుకున్నారు. 2020 ఆగస్టులో మహబూబ్‌నగర్ జిల్లాకు అదనపు కలెక్టర్‌గా వచ్చారు. రెండున్నరేళ్లుగా ఇక్కడే విధులు నిర్వర్తించిన ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ వనపర్తి జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ చేసింది. స్థానిక సంస్థలపై పట్టు ఉన్న ఆయన వనపర్తిలో కలెక్టర్‌గా తనదైన మార్క్‌ను చూపించేలా పరిపాలన చేసేందుకు ప్రణాళికతో ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యి వనపర్తి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/వనపర్తి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముగ్గురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. వనపర్తి కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా కుమురంభీం అసిఫాబాద్ జిల్లాకు బదిలీ కాగా.. ఆమె స్థానంలో మహబూబ్‌నగర్ అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) తేజస్ నందులాల్ పవార్‌ను పదోన్నతిపై జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఇక మహబూబ్‌నగర్ కలెక్టర్ వెంకట్రావ్ సూర్యాపేట జిల్లాకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ జి.రవి రానున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

వనపర్తి కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా కుమురంభీం అసిఫాబాద్ జిల్లాకు..

- జిల్లా కలెక్టర్‌గా తేజస్ నందులాల్ పవార్
- మహబూబ్‌నగర్ కలెక్టర్ వెంకట్రావ్ సూర్యాపేట జిల్లాకు బదిలీ
- ఆయన స్థానంలో జగిత్యాల నుంచి జి.రవి రాక

వెంకట్రావ్‌కు ఉమ్మడి జిల్లాతో ఎనలేని బంధం

ప్రస్తుతం మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా ఉన్న వెంకట్రావ్‌కు ఉమ్మడి పాలమూరుతో ఎనలేని బంధం ఉంది. 2018లో మహబూబ్‌నగర్ జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత నూతనంగా ఏర్పడిన నారాయణపేట జిల్లాకు పదోన్నతిపై కలెక్టర్‌గా వెళ్లాడు. అక్కడి నుంచి మళ్లీ 2020 ఫిబ్రవరిలో మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. మూడేళ్లుగా ఇక్కడే విధులు నిర్వర్తించారు. 2018కి ముందు ఆయన పూర్వ నల్లగొండ జిల్లాలో జెడ్పీ సీఈఓగా, అదనపు జేసీగా పనిచేశారు. తాజాగా పూర్వ నల్లగొండ నుంచి కొత్త జిల్లాగా ఏర్పడిన సూర్యాపేటకు కలెక్టర్‌గా బదిలీపై వెళ్లనున్నారు.

వ్యవసాయ కుటుంబం నుంచి..

మహబూబ్‌నగర్ రానున్న కొత్త కలెక్టర్ గుగులోతు రవిది వ్యవసాయ కుటుంబం. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆయన మొదట జెన్‌కోలో ఏడీగా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత గ్రూప్–1కు ఎంపికకాగా.. ఆర్డీఓగా పాల్వంచ, దేవరకొండ, ఆదిలాబాద్‌లో పనిచేశారు. నల్లగొండలో డీఆర్‌ఓగా పని చేసి జాయింట్ కలెక్టర్‌గా యాదాద్రి, హైదరాబాద్‌లో 2019 వరకు విధులు నిర్వర్తించారు. 2020 ఫిబ్రవరిలో పదోన్నతిపై జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా రాగా.. మూడేళ్ల పాటు అక్కడే ఉన్నారు. తాజాగా ఆయన మహబూబ్‌నగర్‌కు బదిలీపై రానున్నారు.

వైభవంగా ఈదమ్మ షిడే

- జాతరకు తరలివచ్చిన భక్తజనం
- ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ



పాన్‌గల్ ఈదమ్మ ఆలయం వద్ద షిడే ఊరేగింపు



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పాన్‌గల్: వేలాదిగా తరలివచ్చిన భక్తజనం.. మొక్కులు తీర్చుకునేందుకు బోనం కుండలతో చేరుకున్న మహిళల నడుమ ఈదమ్మ షిడే ఉత్సవం వైభవంగా సాగింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన ఈదమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వేలాదిగా జనం తరలిరావడంతో జాతర ప్రాంతం భక్తజన సంద్రంగా మారింది. మహిళలు బోనాలతో గుడి చుట్టూ ప్రదర్శనలు చేస్తూ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. షిడేకు గొర్రె పిల్లను కట్టి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ నిర్వహకులు ఏర్పాట్లు చేసినప్పటికి అనుకున్నదాని కంటే భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఏర్పాట్లు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

స్వల్ప ఘర్షణ

జాతరలో రథం లాగే క్రమంలో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. రథాన్ని లాగుతామని మొదట బీజేపీ కార్యకర్తలు ముందుకు రాగా, ఆనవాయితీ ప్రకారం రథాన్ని గ్రామస్తులు లాగుతారని చెప్పడం, వారికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు మద్దతు తెలపడంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని లాఠీలకు పనిచెప్పి అందరినీ చెదర గొట్టడంతో షిడే కార్యక్రమం సాఫీగా సాగింది. పలువురు బీజేపీ కార్యకర్తలు స్టేషన్‌కు చేరుకొని పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

జాతర ప్రాంతం.. జన సంద్రం

షిడే ఉత్సవాలను తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో జాతర ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మిఠాయి దుకాణాలు , రంగుల రట్నం, ఉయ్యాలలు, గాజుల దుకాణాలు తదితర షాపులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ నాగన్న ఆధ్వర్యంలో ఆరుగురు ఎస్‌ఐలు, పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి దంపతులు, ఎంపీటీసీ హైమావతి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాముయాదవ్ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూజారి నాగన్న , బాలస్వామి,తహసీల్దార్ యేసయ్య, చక్రపాణి, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక వివాదం

- ఇసుక డంపు, అక్రమ తరలింపుపై చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల వాగ్వాదం
- పట్టుబడిన టిప్పర్‌ను తరలించేసిన బీఆర్‌ఎస్ నాయకులు



ఖిల్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద వాగ్వాదానికి దిగిన బీజేపి, బీఆర్‌ఎస్ నాయకులు

ఖిల్లాఘనపురం: అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేయడం, తరలించడంపై బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకుల మధ్య వివాదం నెలకొనగా.. పోలీసుల రంగప్రవేశంతో గొడవ సద్దుమణిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పిల్లివాగు సమీపంలో అక్రమంగా ఇసుక డంపు చేయగా ఈ నెల 25వ తేదీన మండల బీజేపి నాయకులు తహసీల్దార్ భానుప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. 27వ తేదీ వరకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయమై తహసీల్దార్‌ను అడిగేందుకు మంగళవారం బీజేపి జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణతో నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి బయలుదేరగా మార్గమధ్యలో ఇసుక టిప్పర్ కనిపించడంతో అదే విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ టిప్పర్‌కు పర్మిషన్ ఉందా, ఉంటే చూపాలని పట్టుబట్టగా పర్మిషన్ లేదని చెప్పారు. వెంటనే డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్ సిబ్బందితో కలిసి వెళ్లి సదరు టిప్పర్‌ను నిలిపివేశారు. ఇసుక తరలిస్తున్న వారిపై ఎలాంటి ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని బీజేపీ నాయకులు పట్టు బట్టారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఎంట్రీ.. వాగ్వాదం

ఇదే సమయంలోనే బీఆర్‌ఎస్ నాయకుడు వనపర్తి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బాలీశ్వర్‌రెడ్డి, మరికొందరు కార్యాలయం వద్దకు చేరుకొని బీజేపి నాయకులతో గొడవకు దిగారు. ఇదే క్రమంలో ఇసుక టిప్పర్‌ను బీఆర్‌ఎస్ నాయకులు అక్కడి నుండి తరలించారు. చివరకు పోలీసులు అక్కడి చేరుకుని ఇరువర్గాలను పంపించివేశారు. బుధవారం (నేటి) లోగా తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు అక్కడ నుండి వెళ్లిపోయారు.

ప్రభుత్వం స్పందించే వరకు పోరు



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

అమరచింత: నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పాటు స్థలాలు వున్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం ఇచ్చే వరకు గుడిసెల పోరు ఆగదని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలో గత 145రోజులుగా కొనసాగుతున్న గుడిసెల పోరు కార్యక్రమంలో మంగళవారం ఆమె పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇస్తామని ప్రకటించిన కేసీఆర్ సీఎం అయ్యాక హామీలను తుంగలో తొక్కి ప్రజల జీవితాలతో ఆడుకొంటున్నాడని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 కేంద్రాలలో సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెల పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వీటి పరిష్కారం కోసం ఫిబ్రవరి 2న మున్సిపల్, మండల కేంద్రాలలో ధర్నా, 9న ఇందిరాపార్కు వద్ద ఆందోళన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమరచింత పట్టణంలో గత 25 సంవత్సరాల కిందట ఇచ్చిన ఇంటి పట్టాలకు ఇప్పటి వరకు ఇంటి స్థలాలను ప్రభుత్వం చూపకపోవడం దారుణమని, ఇక సమస్యలను పరిష్కరించలేని ప్రజా ప్రతినిధులు ఎందుకన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇంటి నిర్మాణం కోసం శంకుస్థాపన చేయకపోవడం శోచనీయమన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణమ్మ, జిల్లా కార్యదర్శి లక్ష్మీ, జీఎస్.గోపి, బుచ్చన్న, వెంకటేష్, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రైళ్లు కూతపెట్టేనా?

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా 'పాలమూరు'కు మొండిచేయే..



మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్

- సర్వేలకే పరిమితమైన కృష్ణ– వికారాబాద్, గద్వాల– మాచర్ల లైన్లు
- మహబూబ్‌నగర్ ఆదర్శ స్టేషన్ ఎంపికపై నీలినీడలు
- నేడు ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై మరోసారి ఆశలు

స్టేషన్ మహబూబ్‌నగర్/ అచ్చంపేట/ గద్వాల రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు ప్రతిఏటా మొండిచేయే ఎదురవుతోంది. ప్రధానంగా మూడు జిల్లాలకు వరప్రదాయిని అయిన గద్వాల– మాచర్ల లైన్ కోసం నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూపులకే పరిమితమవగా.. ఆదర్శస్టేషన్‌గా మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్ ఏర్పాటు, ఏపీలోని గుంటూరు, నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు కర్ణాటకలోని రాయచూరు జిల్లాల ప్రజల చిరకాల కోరికపై కూడా నీలినీడలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా అయా సమస్యలకు పరిష్కారం చూపుతారా అని ఉమ్మడి జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.గతేడాది బడ్జెట్‌లో కేవలం ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులైన మహబూబ్‌నగర్– మునీరాబాద్ రైల్వే, సికింద్రాబాద్– మహబూబ్‌నగర్ డబ్లింగ్ లైన్‌లకు మాత్రమే నిధులు వెచ్చించారు. సికిందరాబాద్– మహబూబ్‌నగర్ డబ్లింగ్ లైన్‌కు రూ.150 కోట్లు కేటాయించగా.. పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మహబూబ్‌నగర్– మునీరాబాద్ రైల్వేలైన్‌కు రూ.289 కోట్లు కేటాయించారు. అయితే ప్రతిసారి బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నిధులు తక్కువగా కేటాయిస్తున్నారే ఆరోపణలున్నాయి.

చురుగ్గా మునీరాబాద్ పనులు..

మహబూబ్‌నగర్– మునీరాబాద్ రైల్వేలైన్ 244 కి.మీ., నిర్మాణానికి 1997– 98లో ఆమోదం లభించింది. రూ.1,723 కోట్ల అంచనాతో మహబూబ్‌నగర్– మునీరాబాద్ రైల్వేలైన్ పనులు చేపట్టారు. ఈ రైల్వే లైన్ (సౌత్‌సెంట్రల్ రైల్వే) తెలంగాణ రాష్ట్ర పరిధిలో 66 కి.మీ., (సౌత్ వెస్టర్న్ రైల్వే) కర్ణాటక రాష్ట్ర పరిధిలో 178 కి.మీ., ఉంది. గతేడాది బడ్జెట్‌లో రూ.289 కోట్లు కేటాయించారు. మహబూబ్‌నగర్ నుంచి మక్తల్ వరకు పలు (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణాలు చేపట్టారు. దేవరకద్ర– కృష్ణ వరకు దాదాపు 60 కి.మీ., పనులు పూర్తయ్యాయి. ఈ లైన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి.

- దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో రెండో పెద్ద స్టేషన్ మహబూబ్‌నగర్. జిల్లా స్టేషన్ నుంచి ప్రతిరోజు 5– 6వేల మంది హైదరాబాద్– కర్నూలు మీదుగా ప్రయాణిస్తుంటారు. మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను ఆదర్శస్టేషన్‌గా మార్చాలన్న డిమాండ్ నెరవేరడం లేదు. ఏ గ్రేడ్ హోదా వస్తే జిల్లా రైల్వేస్టేషన్‌లో ప్రతి రైలు ఆగే అవకాశం ఉంటుంది.
- గద్వాల– మహబూబ్‌నగర్ మధ్య డబ్లింగ్ లైన్ చేపట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ లైన్ నిర్మాణం పూర్తి కావడంతో గద్వాల వరకు కూడా పూర్తి చేస్తే ప్రయాణం మరింత సులభతరంగా ఉంటుంది. ఇప్పటికే కర్నూలు– మహబూబ్‌నగర్ వరకు విద్యుద్దీకరణ పనులు సైతం పూర్తయ్యాయి.

నిజాం కాలం నుంచి..

గద్వాల– మాచర్ల రైల్వేలైన్ ప్రతిపాదన నిజాం కాలం నుంచే కొనసాగుతుంది. ఈ ప్రాజెక్టు కోసం మాచర్ల, దేవరకొండ, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల వరకు ప్రతిపాదనలు పంపగా రైల్వే అధికారులు మూడుసార్లు సర్వే చేశారు. కొత్త లైన్ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పీపీసీ మోడల్ కింద డీపీఆర్ తయారు చేసి రూ.1,068 కోట్ల అంచనాతో రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి నివేదిక పంపింది. ఇందులో 49 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉండగా.. ప్రస్తుతం దీని అంచనా రూ.1,500 కోట్లకు చేరింది. అయితే మొత్తం కేంద్రమే భరించాలని ప్రస్తుత నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు కేంద్రమంత్రిని కలిసి విన్నవించారు. గత పార్లమెంట్ సమావేశాల్లోనూ రైలు మార్గ ఆవశ్యకత గురించి వివరించారు. ప్రతిసారి రైల్వే బడ్జెట్‌లో గద్వాల– మాచర్ల లైన్ ప్రస్తావన వస్తున్నా అడుగు ముందుకు పడటం లేదు.

ఏర్పాటు కావాల్సిన కొత్త మార్గాలు

అచ్చంపేట– మహబూబ్‌నగర్– తాండూరు 180 కి.మీ., కొత్త రైల్వేలైను కోసం రూ.360కోట్లతో గతంలో కేంద్రం ఆమోదం తెలిపింది. దీనికి ఇప్పటి వరకు నిధులు కేటాయించకపోవడంతో కాగితాలకే పరిమితమైంది. అదేవిధంగా 2007లో రూ.340 కోట్లతో ప్రతిపాదించిన జడ్చర్ల–నాగర్‌కర్నూల్– కొల్లాపూర్–నంద్యాల వరకు 175 కి.మీ., రైలుమార్గం ఆచరణలో అమలు కాలేదు. హైదరాబాద్– అచ్చంపేట– శ్రీశైలం మార్గం ఏర్పాటు ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. నారాయణపేట– ఊట్కూరు– కోస్గి మీదుగా వికారాబాద్ కొత్త రైల్వే లైను కోసం 30 ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేకపోయింది.

శిక్షణ కేంద్రం సంగతేంటి?

సౌత్ సెంట్రల్ రైల్వేలోనే సికింద్రాబాద్ తర్వాత వంద ఎకరాలకు పైగా స్థలం కలిగి ఉండడం గద్వాల ప్రత్యేకత. ఇందులో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పిస్తామని గత పాలకులు హామీలిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా.. అది కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఈ విషయాన్ని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు ఎంపీ రాములుకు సైతం విన్నవించారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేస్తే కరువు ప్రాంతంగా పేరుగాంచిన నడిగడ్డకు ఎంప్లాయ్‌మెంట్ హబ్‌గా మారే అవకాశం ఉంది.

రైల్వేలైన్ అవసరం ఉంది..



నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో అవసరమైన కొత్త రైలు మార్గాల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నాం. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావిస్తూనే.. గతంలో అనేకసార్లు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రధానంగా మాచర్ల–గద్వాల రైల్వేలైన్ ఈ ప్రాంతానికి ఎంతో అవసరం ఉంది. ఈసారి జరిగే బడ్జెట్ సమావేశాల్లో ప్రాధాన్యం ఇచ్చేలా మాట్లాడతాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే మొత్తం నిధులు ఇచ్చేలా ఒత్తిడి తెస్తాం.

– రాములు, ఎంపీ, నాగర్‌కర్నూల్



సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

అట్టహాసంగా సాక్షి ప్రీమియర్ లీగ్

- టోర్నీని ప్రారంభించిన మహబూబ్‌నగర్ కలెక్టర్ వెంకట్రావ్
- హోరాహోరీగా తలపడిన 'జూనియర్' జట్లు

వివరాలు 8లో

క్లుప్తంగా

అత్యాచార నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష

మక్తల్: పట్టణానికి చెందిన మైనర్ బాలికకు 2020 సంవత్సరంలో మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన నిందితుడికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా, బాధితురాలికి రూ.5లక్షల నష్టపరిహారం ఇవ్వాలని నారాయణపేట జిల్లా కోర్టు జడ్జి ఎంఏ రఫీ తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వెల్లడించారు. 2020 సంవత్సరంలో మక్తల్ పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన గొల్లపల్లి కురుమూర్తి పట్టణానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాములు కేసు నమోదు చేయగా, సీఐ శంకర్ విచారణ చేసి నిందితుడిపై బాధితురాలి తరఫున చార్జిషీట్ ఫైల్ చేశారు. ఎస్ఐ మురళీకృష్ణ, అడిషనల్ పీపీ 10మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టిని పూర్తి స్థాయిలో విచారణ తరువాత నిందితుడికి జడ్జి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు వెల్లడించారు.

ఐదు రోజుల్లో వివాహం

- అనారోగ్యంతో యువతి మృతి


సునీత

ఊర్కొండ: మరో ఐదు రోజుల్లో వివాహం అనగా ఓ యువతి మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని ఇప్పపహాడ్‌లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సునీత (31) కొన్ని రోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో ఆదివారం కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

రాజోళి: మండలంలోని ఓ గ్రామంలో ఐదేళ్ల చిన్నారిపై చిన్నయ్య(35) అనే వ్యక్తి అత్యాచారయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో చిన్నారి సోమవారం రాత్రి ఆడుకుంటుండగా, చిన్నయ్య చిన్నారికి చాక్లెట్ ఇస్తానని ఇంట్లోకి తీసుకెళ్లాడు. భయాందోళనకు గురైన చిన్నారులు బయటకు పరుగెత్తింది. విషయాన్ని తల్లిదండ్రులకు తెలుపగా, మంగళవారం చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం..?

జడ్చర్ల: స్థానిక రంగారావుతోటలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద మంగళవారం ఓ బాలుడిని బాబాయ్ బైక్‌పై దిగబెట్టి వెళ్లిన వెంటనే సదరు బాలుడిని ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై ఎక్కించుకుని రైల్వే స్టేషన్ వైపు తీసుకెళ్తుండగా గాంధీ చౌరస్తాలో స్థానికులు గుర్తించి పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. అనంతరం బాలుడి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమ పిల్లాడిని గుర్తించి తీసుకొచ్చారు. అయితే ఇందుకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, బాలుడు తనంత తానే సదరు వ్యక్తి దగ్గరకు వెళ్లగా తీసుకెళ్లినట్లు, ఎలాంటి కేసునమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెలు మృతి

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ టైరోడ్డులో మంగళవారం లారీడ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడంతో 30 గొర్రెలు మృతిచెందాయి. ఇందుకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం కర్నె గ్రామానికి చెందిన లింగప్ప, శివరాజ్‌లు గొర్రెలను సొంత గ్రామం నుంచి కర్ణాటకకు వలస తీసుకెళ్తున్నారు. కృష్ణా మండలం గుడెబల్లూరు టై రోడ్డులో లారీ వేగంగా గొర్రెలపై నుంచి వెళ్లడంతో 30 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

పాముకాటుకు గురై బాలిక మృతి

బల్మూర్: పాముకాటుకు గురై చికిత్స పొందుతూ బాలిక మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని కొండనాగులలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండనాగుల పంచాయతీలోని జాగాల కాలనీకి చెందిన నిమ్మల వెంకటయ్య, కవిత దంపతుల కూతురు జగదీశ్వరి(12) జనవరి 27న ఇంటి నుంచి వ్యవసాయ పొలానికి వెళ్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబీకులు బాలికను చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని గమనించి హైదరాబాద్‌లోని నీలోఫర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు కటుంబసభ్యులు తెలిపారు. సంఘటనపై మృతురాలి అత్త వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు.

అట్టహాసంగా సాక్షి ప్రీమియర్ లీగ్


ప్రారంభోత్సవంలో పాల్గొన్న క్రీడాకారులు


టాస్ వేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

- టోర్నీని ప్రారంభించిన మహబూబ్‌నగర్ కలెక్టర్ వెంకట్రావ్
- హోరాహోరీగా తలపడిన 'జూనియర్' జట్లు


బ్యాటింగ్ చేస్తున్న పాలమూరు ఐటీఐ కళాశాల విద్యార్థి

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE | SUDHAKAR PIPES AND FITTINGS LEADER IN QUALITY AND TECHNOLOGY

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ 'సాక్షి మీడియా గ్రూప్' ఆధ్వర్యంలో ఎస్‌పీఎల్ (సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్) మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మహబూబ్‌నగర్ కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ముఖ్య అతిథిగా హాజరై లీగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి వరుసగా సాక్షి క్రికెట్ టోర్నీలో నేను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తి చాటాలని పిలుపునిచ్చారు. ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం ఆడాలని కోరారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్‌తో ఇతర పోటీ పరీక్షలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం కలెక్టర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి ఎస్‌పీఎల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సాక్షి యూనిట్ బ్రాంచ్ మేనేజర్ శ్యాంసుందర్, బ్యూరో ఇన్‌చార్జ్ కిషోర్‌కుమార్, ఎడిషన్ ఇన్‌చార్జ్ హరిప్రసాద్, సాక్షి టీవీ బ్యూరో విజయ్‌భాస్కర్, యాడ్స్ ఇన్‌చార్జ్ శివుడు, సుధాకర్ పైప్స్ ప్రతినిధి ప్రశాంత్, పీఈటీ అబ్దుల్లా, కోచ్ ఎండీ మన్నాన్, పలువురు రిపోర్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎస్‌పీఎల్‌కు స్పాన్సర్‌గా సుధాకర్ పీవీసీ వ్యవహరిస్తున్నారు. పంచవటి ఆస్పత్రి యాజమాన్యం వారు క్రికెట్ మైదానంలో అంబులెన్స్ సౌకర్యం కల్పించింది.

హోరాహోరీగా మ్యాచ్‌లు..

ఎస్‌పీఎల్ నాకౌట్ మ్యాచుల్లో జూనియర్ కళాశాల స్థాయి జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తొలి మ్యాచ్‌లో ప్రతిభ జూనియర్ కళాశాల జట్టు–2 పది వికెట్ల తేడాతో వాగ్దేవి జూనియర్–2 జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వాగ్దేవి జట్టు 8.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 46 పరుగులు చేసింది. ప్రతిభా బౌలర్ కార్తీక్ మూడు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రతిభ కళాశాల జట్టు వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని చేరింది. జట్టులో తరుణ్ 32 పరుగులు చేసి నాటౌట్‌తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

❑ రెండో మ్యాచ్‌లో పాలమూరు ఐటీఐ కళాశాల జట్టు 33 పరుగుల తేడాతో రిషి జూనియర్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పాలమూరు ఐటీఐ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లకు 102 పరుగులు చేసింది. జట్టులో అభి (40) పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన రిషి కళాశాల 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. ఫరీద్, అద్నాన్ రెండేసి వికెట్లు తీశారు. అభి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

తొలిరోజు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్


తరుణ్ (ప్రతిభ కళాశాల)


అభి (పాలమూరు ఐటీఐ)


ఆషిష్ (ప్రతిభా కళాశాల)


అఫ్వాన్ (జేపీఎన్‌సీఈ)


రిజ్వాన్ (ప్రభుత్వ ఒకేషనల్)

పల్లవిపై ప్రతిభా కళాశాల విజయం

మూడో నాకౌట్ మ్యాచ్‌లో ప్రతిభా కళాశాల జట్టు 18 పరుగుల తేడాతో పల్లవి కళాశాల జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రతిభ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్లకు 89 పరుగులు చేసింది. జట్టులో ఆషిష్ (34), హర్షిత్ (24) పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన పల్లవి కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసింది. కౌషల్ 2 వికెట్లు తీశాడు. ఆషిష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

జేపీఎన్‌సీఈ జట్టు గెలుపు..

జేపీఎన్‌సీఈ పాలిటెక్నిక్ కళాశాల–2 జట్టు 7 వికెట్ల తేడాతో విశ్వభారతి కళాశాల జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన విశ్వభారతి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జేపీఎన్‌సీఈ 7 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. జట్టులో అఫ్వాన్ (33 నాటౌట్) పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

❑ తొలి రోజు చివరి లీగ్ మ్యాచ్‌లో ప్రభుత్వ బాలుర ఒకేషనల్ కళాశాల జట్టు 3 వికెట్ల తేడాతో జేపీఎన్‌సీఈ–1 కళాశాల జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన జేపీఎన్‌సీఈ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. జట్టులో ఫజిల్ 31 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల జట్టు 9 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. రిజ్వాన్ 32 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఆవంచలో 'సామాజిక పటం' ప్రదర్శన


సామాజిక పటాన్ని వివరిస్తున్న విద్యార్థులు

బిజినేపల్లి: గ్రామాల్లో రావేఫ్ విద్యార్థులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించారని, వాటిని గ్రామస్తులు చర్చించుకుని పరిష్కరించుకోవాలని పాలెం కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తిమ్మాజీపేట మండలంలోని ఆవంచలో రావేఫ్ విద్యార్థులు సామాజిక పటం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సామాజిక పటంలో గ్రామ సమస్యలను క్లుప్తంగా వివరించారని, గ్రామంలోని నేలలు, వాటికి అనుకూల పంటలు, ఏమేమి సాగు చేయాలో వివరించారన్నారు. అంతే కాకుండా పండ్ల తోటలు, కూరగాయల సాగుకు అనుకూలమైన పంటలు వివరించారన్నారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వాటి ఉపయోగం, వనరులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దయాకర్‌రెడ్డి, సర్పంచ్ అజయ్‌కుమార్, ఏఓ కమల్‌కుమార్, ఏఈఓ సాయిరాం, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి


బండరాములు

అమరచింత: బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని కిష్టంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టంపల్లికి చెందిన బండ రాములు(43) గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలానికి బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బైక్ పై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

జములమ్మకు సారె..


జములమ్మ అమ్మవారిని మెట్టింటికి తీసుకెళ్లేందుకు సారెతో బయలుదేరిన ఆలయ కమిటీ సభ్యులు

- పుట్టింటి నుంచి తీసుకెళ్లేందుకు గుర్రంగడ్డకు వెళ్లిన ఆలయ కమిటీ
- జాతర తొలిరోజే సుమారు 70వేల వరకు భక్తులు రాక
- గద్వాల నుంచి జమ్మిచేడు వరకు ట్రాఫిక్ అంతరాయం

గద్వాల రూరల్: జములమ్మ జాతర అంగరంగ వైభవంగా మొదలైంది. జనవరి చివరివారంలో మాఘ శుద్ధ పౌర్ణమికి ముందు మంగళవారం నాడు పుట్టింటిలో ఉన్న జములమ్మ అమ్మవారిని, మెట్టినిల్లు జమ్మిచేడుకు సాంప్రదాయబద్ధంగా తీసుకురావడం, పౌర్ణమి నాడు జాతరను అధికారికంగా మొదలుపెట్టడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే మంగళవారం పుట్టినింటిలో ఉన్న జములమ్మను మెట్టినింటికి తీసుకొచ్చేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఎద్దుల బండిపైన బయలుదేరి వెళ్లారు. అదేవిధంగా ప్రతి మంగళవారం జమ్ములమ్మ తల్లికి మొక్కులు సమర్పించే ఆనవాయితీ కొనసాగుతూ వస్తుండడంతో ఈ ఏడాది కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నడిగడ్డ ప్రాంతం నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీలోని భక్తులు తరలివచ్చారు. సుమారు 70వేల మంది మొక్కు చెల్లించారు.

తెల్లవారుజామున మెట్టినింటికి..

రాత్రి 9గంటలకు పుట్టినింటి నుంచి సారెతో పూజలు చేసి కృష్ణానదిని దాటిస్తారు. అనంతరం అమ్మవారిని గద్వాల మండలంలోని బీరెల్లి, లత్తీపురం, వెంకటోనిపల్లి గ్రామాల మీదుగా ఊరేగిస్తూ మెట్టినిళ్లు అయిన జమ్మిచేడుకు తెల్లవారుజామున తీసుకువస్తారు. ఇక్కడి ఎమ్మెల్యే సాంప్రదాయబద్ధంగా అమ్మవారికి ఆహ్వానం పలికి, ఆలయంలో కొలువుదీరుస్తారు.


జనసందోహంతో జములమ్మ జాతర

పౌర్ణమి నాడు జాతర..

ఇలా మెట్టినింటికి చేరిన అమ్మవారి జాతర ఉత్సవాలను మాఘశుద్ధ పౌర్ణమి అయిన ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం అధికారికంగా జాతరను ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సతీష్, ఈఓ కవిత తెలిపారు. అదేరోజు మహారాష్ట్ర లోని పూణెకు చెందిన 70మంది కళాకారులచే అమ్మవారికి ప్రత్యేకంగా స్వాగత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతురాజు విన్యాసాలు, పుట్టబొమ్మలు, శివసత్తులు, డప్పువాయిద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆహ్వానం పలకనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ అంతరాయం..

జములమ్మ జాతర తొలి మంగళవారం సుమారు 70వేల మంది భక్తులు తరలివచ్చారు. దీంతో గద్వాల–జమ్మిచేడు వరకు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. గతంలో జాతర సందర్భంగా గద్వాల–జమ్మిచేడు వరకు వాహనాల రాకపోకలను నియంత్రించి వన్ వే విధానాన్ని అమలుచేసేవారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడేది కాదు.

లాభసాటిగా 'సుబాబుల్'

- కలప పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్న రైతులు

అలంపూర్: రైతులను వర్షాభావ పరిస్థితులు తీరని నష్టాలకు గురి చేస్తున్నాయి. వాతావరణ ప్రతికుల పరిస్థితులను తట్టుకోవడానికి రైతన్న ఆహార పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. పప్పుదినుసులు, నూనెగింజలు, వాణిజ్య, ఉద్యానవన పంటలతోపాటు కలప పంటల సాగుపై దృష్టిసారిస్తున్నారు. కలప సాగులో ప్రధానంగా సుబాబుల్ పంట ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గం మానవపాడు, వడ్డేపల్లి, రాజోలి, అయిజ మండలాల్లో సుబాబుల్ సాగుపై రైతులు మక్కువ కనబరుస్తున్నారు. ప్రతికుల వాతావరణంలోనూ దీని సాగు సులభతరం కావడంతో అనేక మంది సుబాబుల్ పెంపకంతో కొంత ఊరట చెందుతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో సుమారు 6 నుంచి 7 వేల ఎకరాల్లో సుబాబుల్‌ను సాగు చేశారు.

వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో సాగు..

సుబాబుల్ అతిత్వరగా పెరిగే బహువార్షిక మొక్క. వంట చెరుకు, పశుగ్రాసం, పనిముట్లకు, కలప, కాగితపు గుజ్జు లాంటి అవసరాలకు ఉపయోగపడుతుంది. వీటి విత్తనాల్లో 24 శాతం మాంసకృతులు కలిగి ఉంటాయి. అందుకే సులభంగా మొలకెత్తుతాయి. వాతావరణ ప్రతికుల పరిస్థితుల్లో సుబాబుల్ సాగు లాభసాటిగా ఉంటుంది. ఉష్ణ మండలాల్లో బాగా పెరుగుతుంది. వర్షపాతం 600 నుంచి 1,700 మి.మీ ఉన్న ప్రాంతాల్లో సాగు అనువుగా ఉంటుంది. క్షార, ఆమ్ల నేలల్లో తప్ప అన్నీ రకాల తటస్థ నేలలో పెంచడానికి అనువైంది. లోతైన, సారవంతమైన, బంజరు భూముల్లో, చెరువు గట్లు, కాల్వ గట్లు, పొలాల గట్లపైన, పంట పొలాల్లో పెంచవచ్చు. మెట్ట పొలాల్లో హవాయిన్ కామన్, హవాయిన్ జెయింట్–కె–8, కె–28, నీటి వసతి ఉన్న హవాయిన్ జెయింట్–కె–636 రకాలను సాగు చేయడానికి అనువుగా ఉంటుంది.


సాగు చేసిన సుబాబుల్ పంట

నారు మొక్కల పెంపకం–నాటే పద్ధతి..

జూలైలో సుబాబుల్ సాగు అనువుగా ఉంటుంది. దీంతో నారుమళ్లలో లేదా పాలిథీన్ సంచుల్లో మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో విత్తనాలు విత్తుకోవాల్సి ఉంటుంది. రెండేళ్లకు పైబడిన చెట్ల నుంచి విత్తనాలను సేకరించాల్సి ఉంటుంది. ఒక కిలోకు 16 నుంచి 20 వేల విత్తనాలు ఉంటాయి. విత్తన శుద్ధిలో భాగంగా సుమారు 30 సెల్సియస్ వేడి నీటిలో 5 నిమిషాలు ఉంచి ఆ తర్వాత తీసిన విత్తనాలను చల్లని నీటిలో 12 గంటలు నానబెట్టి విత్తుకోవాలి. నారుమళ్లలో నేరుగా విత్తడానికి వరుసల మధ్య 20 సెం.మీ, వరుసలో 4 సెం.మీ, దూరం 1.5 సెంమీ లోతులో విత్తనాలు విత్తుకోవచ్చు. లేదా 22×10 సెం.మీ పాలిథీన్ సంచుల్లో పేడ, ఎరువులను కలిపి మట్టిని నింపి ఒక సంచిలో రెండు విత్తనాల చొప్పున విత్తుకోవాలి.

పంట సాగు–యాజమాన్య పద్ధతులు..

వేసవిలో 30×30 పరిమాణంలో 45 సెం.మీ లోతులో గుంతను తవ్వితే నేల గుల్లబారి మొక్క నాటడానికి అనువుగా ఉంటుంది. వర్షాకాల ప్రారంభంలోనే మట్టి నింపిన గుంతలు, సంచుల్లోనూ మొక్కను నాటాలి. మొక్కల మధ్య దూరం 2×2 లేదా 2×3 ఉండే విధంగా చూసుకోవాలి. ఎకరాకు 666 నుంచి 1000 మొక్కల వరకు నాటుకోవడానికి అవకాశం ఉంటుంది. మొక్కల మధ్య మొదటి సంవత్సరం అంతరసాగు చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల వరకు కలుపు నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

కాల పరిమితి–దిగుబడి..

సుబాబుల్ అవసరాన్ని బట్టి వీటిని ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. పశుగ్రాసానికైతే 2 నుంచి 3 నెలలు, 10 నుంచి 15 సెం.మీ ఎత్తులో నాటాల్సి ఉంటుంది. వంట చెరుకు కోసం 2 నుంచి 3 ఏళ్ల మధ్య ఉపయోగించుకోవాలి. కాగితపు గుజ్జుకి 4 నుంచి 5 ఏళ్ల మధ్య ఉపయోగించవచ్చు. చెట్ల పక్క కొమ్మలు ఎప్పటికి అప్పుడు నరికి పెరిగేటట్లు చేస్తే 10 నుంచి 15 ఏళ్ల వరకు కలప ఉత్పత్తి అవుతుంది. సుబాబుల్ 6 ఏళ్లలో 20 మీ ఎత్తు వరకు పెరుగుతుంది. వర్షాధార ప్రాంతాల్లో కలప దిగుబడి 4 ఘ.మీ వస్తుంది. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రెండు నుంచి మూడు రేట్లు అధికంగా ఉంటుంది. వర్షాధార ప్రాంతాల్లో పశుగ్రాసం 5–10 టన్నుల కాగా నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో 32 నుంచి 36 టన్నుల దిగుబడి వస్తుంది.

లాభాలు ఇలా..

కలప గట్టిగా ఉండడంతో పాటు నాణ్యతగా ఉంటుంది. భవన నిర్మాణం ఫర్నీచర్ తయారీ, గుంజలు, కంచె స్తంభాలు, కొమ్మలు వంట చెరుకుగా, ఆకులు పశుగ్రాసంగా ఉపయోగపడుతాయి. మొక్కలను 8 మీ ఎడంగా రెండు ఉమ్మడి వరుసల్లో వాటిని 30 సెం.మీ ఎత్తుకు కోస్తే ఎకరాకు 0.8 టన్నుల వరకు ఎండు మేత, అర టన్ను వంట చెరుకు లభిస్తుంది. కాగితం తయారీకి శ్రేష్ఠమైన గుజ్జు లభిస్తుంది. అయితే పశుగ్రాసానికి రెండేళ్ల వరకు మేకలు, పశువుల నుంచి కాపాడుకోవాలి. లేత ఆకుల్లో మైమోసిన్ అనేది అధికంగా ఉన్నందున సుబాబుల్‌ను ఇతర పశుగ్రాసాలతో కలిపి మేపుకోవాల్సి ఉంటుంది. అలాగే చెట్లకు సహజ పునరుత్పత్తి ఎక్కువగా ఉండటంతో కలుపు మొక్కలు పడతాయి. వీటిని నివారించుకోవడానికి అంతర్ సేద్యం చేయాలి. సుబాబుల్‌తోపాటు జొన్న, ఆముదం, కంది వంటి పంటలను సాగు చేసుకోవడానికి అవకాశం ఉటుంది.

తుఫాను, కారు ఢీ: మహిళ మృతి

- ఏడు మందికి తీవ్రగాయాలు


ప్రమాదంలో టైర్ విరిగిపోయిన తుఫాను


నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెద్దకొత్తపల్లి: తుఫాను, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందగా.. మరో ఏడు మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పెద్దకొత్తపల్లి ఎస్ఐ రాము కథనం ప్రకారం.. కొల్లాపూర్ మండలంలోని చుక్కాయిపల్లికి చెందిన బండారి బాలమ్మ(60), చెన్నయ్య, పెద్దకొత్తపల్లి మండలంలోని నక్కలపల్లికి చెందిన దాయ ఈశ్వరయ్య, కల్వకుర్తి మండలంలోని కల్వకోల్‌కు చెందిన ఏదుల ప్రవీణ్‌కుమార్ తుఫాన్ వాహనంలో మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వస్తున్నారు. అలాగే కల్వకోలుకు చెందిన జింకల నిర్మల, జింకల మల్లేశ్‌లు ఊశన్న కారులో నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో ఆదిరాలమిట్ట వద్ద కారు ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోగా ఎదురుగా వచ్చిన తుఫాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 8 మందికి తీవ్రగాయాలు కాగా.. 108లో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బండారి బాలమ్మ మృతిచెందింది. ఈశ్వరయ్య కన్నుకు తీవ్రగాయం కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై తుఫాన్ డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

పెట్టుబడులతో రండి

పెట్టుబడులకు ఏపీ అత్యంత అనువైన రాష్ట్రం: సీఎం వైఎస్ జగన్ ● సులభతర వాణిజ్యంలో గత మూడేళ్లుగా నంబర్ వన్

- ఎలాంటి అసౌకర్యం కలిగినా ఒక్క ఫోన్‌కాల్ దూరంలో ఉంటాం
- ఢిల్లీలో పారిశ్రామికవేత్తలతో సన్నాహక సదస్సులో సీఎం భరోసా
- మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, నాస్కామ్ అధ్యక్షురాలు దేబ్జానీ ఘోష్, అసోచామ్ అధ్యక్షుడు సుమంత్ సిన్హా, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు సుచిత్ర ఎల్లా, మంత్రి అమర్‌నాథ్

సాక్షి, న్యూఢిల్లీ: పరిశ్రమల స్థాపనకు అత్యంత అనువైన వాతావరణం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటులో అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. వివిధ దేశాల దౌత్యాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులతోపాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్ సన్నాహక సదస్సుకు హాజరయ్యారు.

అత్యుత్తమ సౌకర్యాలు

'విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. దీనికి అందరినీ ఆహ్వానిస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటులో మీకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నాం. ఏ పారిశ్రామికవేత్తకైనా ఎలాంటి అసౌకర్యం కలిగినా కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటామని కూడా హామీ ఇస్తున్నాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రారంభోపన్యాసంతో పాటు సదస్సు చివరలో ఏపీలో పెట్టుబడులకు గల సానుకూలతలను సీఎం వివరించారు.

శరవేగంగా అనుమతులు..

☛ పరిశ్రమలకు అనుమతుల విషయంలో రాష్ట్రంలో సింగిల్ డెస్క్ పోర్టల్ విధానం అమలులో ఉందని సీఎం జగన్ తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని, శరవేగంగా అనుమతులివ్వడం ద్వారా పారిశ్రామికవేత్తల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అనుకూలంగా ఉందన్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

☛ 11.43 శాతం జీఎస్‌డీపీతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా, అగ్రగామిగా నిలిచింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత మూడేళ్లుగా ఏపీ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. పరిశ్రమల స్థాపనకు మేం చేస్తున్న కృషితో పాటు పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తోనే నెంబర్‌వన్ స్థానంలో స్థిరంగా కొనసాగుతున్నాం. తద్వారా పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంత అనుకూలంగా ఉందో స్పష్టమవుతోంది.

> విశాఖపట్నం త్వరలో కార్యనిర్వాహక రాజధాని కాబోతుంది. రానున్న కొద్ది నెలల్లో నేను కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నా. విశాఖలో నిర్వహించే సదస్సుకు హాజరు కావాలని మీ అందరినీ కోరుతున్నా. మీతో పాటు మీ సహచరులు, ఇతర కంపెనీల ప్రతినిధులను కూడా సదస్సుకు తోడ్కొని వచ్చి ఏపీలో పరిశ్రమల స్థాపన, వ్యాపారం ఎంత సులభతరమో తెలియచేయాలి.
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఏప్రిల్ లోపే విశాఖ నుంచి పాలన

- అనేక ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్నాయి
- అవసరమనుకుంటే ప్రైవేట్ భవనాలు లీజ్‌కు తీసుకుంటాం
- న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన
- నవీన్‌కు సీబీఐ నోటీసులు అవాస్తవం
- మీడియాతో టీటీడీ చైర్మన్, రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: ఏప్రిల్ లోపే విశాఖ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించనున్నారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. మూడు రాజధానులను అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని, న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన కొనసాగుతుందని చెప్పారు. మంగళవారం సింహాచలంలోని గోశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖను పరిపాలన రాజధాని చేయడం ద్వారా దశాబ్దాలుగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి చెందుతుందన్నారు. రాజధాని ఏర్పాటుకు భవనాల సమస్య రాదన్నారు. విశాఖలో ఎక్కువగా ప్రభుత్వ కార్యాలయాలున్నాయని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ భవనాలు కూడా చాలా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే ప్రైవేట్ భవనాలను కూడా లీజ్‌కి తీసుకుంటామన్నారు. ఐటీ కంపెనీలు లిమిటెడ్‌గానే ఉన్నాయి కాబట్టి ఆ బిల్డింగ్స్‌ను కూడా అవసరమైతే రాజధానికి ఉపయోగించుకుంటామన్నారు. ఎన్నికలకు వెళ్లేలోపు పరిపాలనా వికేంద్రీకరణ అనేది జరిగి తీరుతుందన్నారు. కాగా, ముఖ్యమంత్రి నివాసంలో కీలకంగా ఉండే నవీన్ అనే వ్యక్తితో పాటు పలువురికి సీబీఐ నోటీసులు ఇచ్చిందనేది పూర్తిగా అవాస్తవమని వైవీ సుబ్బారెడ్డి తేల్చి చెప్పారు. సీఎం జగన్ ఇంట్లో గత 12 ఏళ్లుగా నవీన్ అనే వ్యక్తి పనిచేస్తున్నారని తెలిపారు. సీఎం సతీమణి భారతమ్మతో మాట్లాడాలన్నా.. లేదా ఆమె ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలన్నా.. తానే కాకుండా తమ కుటుంబ సభ్యులందరూ నవీన్‌కే ఫోన్ చేస్తుంటామని వెల్లడించారు. దాన్ని ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ ఎందుకు భూతద్దంలో పెట్టి చూపిస్తున్నారో అర్థం కాలేదని మండిపడ్డారు.

సీబీఐ విచారణ చేయాలి..

అవినాశ్‌రెడ్డిని సీబీఐ విచారణ చేస్తున్న సమయంలో గదిలో అధికారులు మాత్రమే ఉంటారని, అలాంటప్పుడు లోపల జరిగిన సంభాషణ, విచారణ ఇదే అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ఎలా రాశాయన్నారు. లోపల జరిగిన విచారణ విషయాలను ఈ పత్రికలకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

జనవరిలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.123 కోట్లు

తిరుమల: జనవరిలో తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటింది. జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తిరుమల శ్రీవారికి హుండీలో రూ.123 కోట్లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. జనవరి 2 తేదీన శ్రీవారికి రూ.7.68 కోట్ల హుండీ ఆదాయం లభించింది. టీటీడీ చరిత్రలోనే ఇది అత్యధిక ఆదాయాల్లో రెండోది. గత ఏడాది నుంచి తిరుమల శ్రీవారి ఆదాయం ప్రతి నెలా రూ.వంద కోట్లు దాటుతుండడం గమనార్హం.

కర్ణాటక సంగీత కళాకారిణి లలిత చంద్రన్ కన్నుమూత

ఆమె బొంబాయి సిస్టర్స్‌లో ఒకరు

తమిళ సినిమా: ప్రఖ్యాత కర్ణాటక సంగీత కళాకారుల ద్వయంలో ఒకరైన లలితా చంద్రన్ (70) మంగళవారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె సోదరి సి.సరోజిని. వీరు కేరళలోని తిరుచ్చూర్‌కు చెందినవారు. తల్లిదండ్రులు ముకుందమ్ భాయ్, చిదంబరం అయ్యర్. తండ్రి ఉద్యోగరీత్యా లలితా చంద్రన్, సరోజిని ముంబైలో పుట్టి పెరిగారు. కర్ణాటక క్లాసికల్ సంగీతంలో ప్రావీణ్యం సాధించడంతో వీరికి బొంబాయి సిస్టర్స్ అనే విశేష గుర్తింపు దక్కింది. తర్వాత వారు చెన్నైలోని అడయార్‌లో స్థిరపడ్డారు. దేశవ్యాప్తంగా కర్ణాటక సంగీత కార్యక్రమాలను నిర్వహించి పేరు గడించారు.

ఏపీలో విద్యారంగం అద్భుతం

- ప్రభుత్వ పాఠశాలల తీరుతెన్నులపై ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ ప్రశంసల జల్లు
- గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సందర్శన
- విద్యారంగ పురోగతికి వైఎస్ జగన్ మార్గదర్శకుడు అంటూ ప్రశంస



విద్యార్థినితో మాట్లాడుతున్న నిక్ వుజిసిక్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులు ఆంగ్లంలో మాట్లాడుతున్న తీరు.. అందులో స్పష్టత, వారు అడుగుతున్న ప్రశ్నలకు అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ మంత్రముగ్ధులయ్యారు. 'ప్రపంచం మొత్తానికి నేను ప్రేరణగా నిలిచి ఉండవచ్చు.. కానీ, ఈ ప్రాంతం నాకు ఎంతో ప్రేరణనిచ్చింది' అంటూ ఆయన ఫిదా అయ్యారు. గుంటూరు నగరంలోని చౌత్రా సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను నిక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థినులకు లక్ష్యసాధన, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఆ తర్వాత సాయంత్రం బీఆర్ స్టేడియంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు నగరంలోని వివిధ మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన వేలాది మంది టెన్త్ విద్యార్థులనుద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులు, చేపడుతున్న కార్యక్రమాలపై మరోమారు ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఎంతో అంకితభావం ఉన్న ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఉండటం అభినందనీయమంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. అలాగే, 'నేను ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలలో పర్యటించా. కానీ ఏ దేశంలో లేని అనుభూతి, ప్రత్యేకతను నేను గుంటూరులో పొందాను. అది నా అదృష్టంగా భావిస్తున్నా. ప్రపంచంలో ఎంతోమంది నన్ను హీరో అని పిలిచి ఉండవచ్చు.. కానీ, అంతకంటే ఎక్కువ ఆనందాన్ని ఇక్కడ పొందాను. వెలకట్టలేని విద్యకు, విజ్ఞానానికి అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవా దాలు. ఎంతో మంచి పాలకుడు మీకు ఉన్నారు. అంకితభావం ఉన్న ప్రభుత్వం ఇక్కడ ఉంది. గుంటూరు ప్రాంతం విజ్ఞానం, విద్య పరంగా ఎంతో సామర్థ్యం ఉన్న ప్రాంతం. ప్రపంచవ్యాప్తంగా ఎందరినో కలిశాను. కానీ ఆంధ్రప్రదేశ్ సీఎంతో కలవబోవడం ఎంతో ప్రత్యేకానుభూతిగా ఉంది'.. అంటూ నిక్ తన అనుభూతిని పంచుకున్నారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇవీ..

ఇది సామాన్యమైన విషయం కాదు..

ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంత గొప్పగా మాట్లాడుతారా? ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులు తాను మాట్లాడిన ఫారిన్ ఇంగ్లిషు భాషాశైలిని అర్థంచేసుకుని, అంతేస్థాయిలో ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడిన తీరు అద్భుతం. ఏపీలో ప్రభుత్వ పాఠ శాలలు ఇంత గొప్పగా ఉంటాయని నేను ఊహించలేదు. కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో ఒక ప్రభు త్వ పాఠశాల సకల హంగులతో ఉండటం ఎంతో ఆశ్చర్యంగా ఉంది. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులను ఇంత గొప్ప ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దడం సామాన్య విషయం కాదు.

నా జీవితగాథపై పాఠ్యాంశమా!? జగన్ దేశంలోనే బెస్ట్ సీఎం

రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన 10వ తరగతి ఇంగ్లిషు టెక్ట్స్‌బుక్‌లోని మొదటి పాఠ్యాంశంగా ఉన్న పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో 'ఆటిట్యూడ్ ఆల్టిట్యూడ్' పేరుతో నా జీవితగాథను ముద్రించడం ఆశ్చర్యకరం. పాఠ్యాంశంగా నాకు చోటు కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మీ పాఠ్య పుస్తకంలో రాసిన నా జీవితం గురించి చదివారా? (మీ గురించి చదివామని విద్యార్థులు చెప్పగా, ఆయన అంతులేని ఆనందానికి లోనయ్యారు.) ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడిన పలువురు విద్యార్థినులు.. నాడు–నేడు ద్వారా సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని, ఆయన చలువతో అన్ని రకాల వసతులతో చదువుకుంటున్నామని చెప్పారు. ఇక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో విజన్ కలిగిన నాయకునిగా దేశంలోనే బెస్ట్ సీఎంగా నిలిచారని ఈ సందర్భంగా నిక్ వుజిసిక్ అన్నారు.

మిడ్జిల్ ఎంపీపీ రాజీనామా



కాంతమ్మ

మిడ్జిల్: మండల పరిషత్ అధ్యక్షురాలు కాంతమ్మ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సోమవారం సాయంత్రం జెడ్పీ సీఈఓ జ్యోతికి అందజేశారు. ఈవిషయం బయటపడకుండా జాగ్రత్త తీసుకున్నారు. మండలంలో మొత్తం 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 4 కాంగ్రెస్, 4 బీఆర్‌ఎస్, ఒకరు స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. మిడ్జిల్ ఎంపీపీ ఎస్సీ జనరల్‌కు కేటాయించగా వెలుగోమ్ముల ఎంపీటీసీగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన కాంతమ్మ స్వతంత్ర అభ్యర్థి మద్దతుతో ఎంపీపీగా ఎన్నికయ్యారు. బోయిన్‌పల్లి ఎంపీటీసీ తిరుపతమ్మకు వైస్‌ఎంపీపీ పదవి కట్టబెట్టారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి కేవలం మిడ్జిల్ మాత్రమే ఉంది. ఆ తర్వాత రెండేళ్లకు అభివృద్ధి పేరిట బీఆర్‌ఎస్‌లో చేరారు. కొన్ని నెలల తర్వాత పార్టీలో తగిన గుర్తింపు లభించలేదని తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. తాజాగా సోమవారం ఎవరికీ సమాచారం లేకుండా ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. ఈవిషయంపై ఎంపీపీ కాంతమ్మను వివరణ కోరగా, వ్యక్తిగత పనుల కారణంగా ఎంపీపీ పదవికి మాత్రమే రాజీనామా చేశానని చెప్పారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తి నీటిమట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,440 క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 1,050 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

కొను'గోల్‌మాల్'..!



గండేడ్‌లో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- గండేడ్ మండలంలోని రెండు కేంద్రాల్లోనూ అక్రమాలు
- రూ.లక్షల్లో దారి మళ్లినట్లు తీవ్ర ఆరోపణలు
- జిల్లా కార్యాలయ ఉద్యోగి సహకారం?
- మిల్లర్ల పాత్రపైనా అనుమానాలు

గండేడ్: అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సకాలంలో డబ్బులు రాక ఇబ్బందులు పడుతుంటే.. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మాత్రం అక్రమంగా రూ.లక్షల్లో దారి మళ్లించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో అధికారులు, నిర్వాహకులతోపాటు మిల్లర్ల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గండేడ్ మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో 12,300 ఎకరాల్లో వరిపంట సాగయ్యింది. దీని ద్వారా సుమారు 19 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు గాను మండలంలో ఐకేపీ ద్వారా 14, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 5 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో 9,125 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా.. మిగతాది పీఏసీఎస్ కేంద్రాలతోపాటు ప్రైవేటుగా రైతులు అమ్ముకున్నారు. అయితే కొందరు కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడ్డారన్న సమాచారం బయటకు పొక్కింది. ముఖ్యంగా ఐకేపీ ఆధ్వర్యంలో ఉన్న రెండు గ్రామాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో ఈ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇష్టారాజ్యంగా..

మండలంలోని రెండు కేంద్రాల్లో కలిపి రూ.లక్షల్లో సొమ్ము అక్రమార్జనకు పాల్పడినట్లు సమాచారం. వరి పంట సాగు చేయని రైతులతోపాటు తమకు అనుకూలమైన ఇతర రైతుల పేర్లను నమోదు చేసి వారి అకౌంట్లకు నిధులు మళ్లించినట్లు తెలుస్తుంది. ఇందులో కేంద్రం నిర్వాహకులు ట్రక్కు షీట్లను ఇష్టారాజ్యంగా రాసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇందులో స్థానిక ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతుండగా.. జిల్లా కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి సహకరించినట్లు తెలిసింది. సదరు ఉద్యోగికి కావాల్సిన వారికి అదనంగా ట్రక్ షీట్లు ఇచ్చారని, వారికి అన్ని విషయాల్లో సహకరించారని విశ్వసనీయ సమాచారం. అక్రమాలు జరిగిన కేంద్రాల్లో నిర్వాహకులే సదరు ఉద్యోగి పేరు చెబుతున్నారు. దీనిపై జిల్లా అధికారుల వరకు కూడా సమాచారం చేరినట్లు తెలిసింది.

ట్రక్ షీట్లు పరిశీలిస్తే..

అక్రమాలు జరిగినట్లు అధికారికంగా ఎవరూ ధ్రువీకరించలేదు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత లారీలో ఏయే రైతువి ఎన్ని బస్తాలు అన్న విషయాన్ని ట్రక్ షీట్లలో క్లియర్‌గా రాయడం జరుగుతుంది. వీటిని పరిశీలిస్తే గాని అసలు విషయం తెలియదు. ప్రస్తుతం అధికారులు వాటిని పరిశీలించే పనిలో ఉన్నట్లు సమాచారం. ట్రక్ షీట్ రాసేవారితోపాటు ట్యాబ్ ఎంట్రీ చేసేవారు కుమ్మక్కై ఈ మేరకు అక్రమానికి పాల్పడ్డారని తెలుస్తోంది. ట్రక్ షీట్లు కొనుగోలు కేంద్రం వద్దే రాయాల్సి ఉండగా నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల వద్ద రాసి ఎవరి కంట పడకుండా డ్రైవర్లకు అందజేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఒక్కో లారీకి 5– 10 బస్తాల వరకు ఎక్కువ రాసి తమకు అనుకూలమైన వారి అకౌంట్లలో డబ్బులు వేసుకున్నట్లు సమాచారం. దీంతోపాటు తూకంలో మోసాలకు పాల్పడి మిగులు ధాన్యాన్ని నిర్వహణ కమిటీకి తెలియకుండా తమ పేర రాసుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఈ రెండు కేంద్రాలపై గతంలో కూడా ఆరోపణలు వచ్చాయి. వీటితోపాటు మండలంలో మిగతా కేంద్రాల్లో అక్రమాలు జరిగాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్ని ట్రక్కు షీట్లపై ఏపీఎం సంతకం లేకపోవడంతో అసలు విషయం బయటపడిందని చెబుతున్నారు. సీసీలు ఇతర అధికారులు పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలు లేకపోలేదు. నిర్వాహకులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, మిల్లర్ల పాత్ర కూడా ఉందేమోనన్న అనుమానం కలుగుతోంది. ఒకవేళ వారి పాత్ర లేకపోతే ప్రభుత్వానికి వారు బియ్యం ఎలా ఇవ్వగలుగుతారు అన్నది సంశయం. అయితే ఇందులో ఎవరెవరి పాత్ర ఉంది.. అక్రమం నిజంగా జరిగిందా.. జరిగితే ఏ స్థాయిలో అనేది అధికారులు లోతుగా విచారణ చేస్తే గాని తెలియదు.

> **సమాచారం లేదు..**
>
> కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరిగినట్లు తెలియదు. ఆరోపణలు వినిపిస్తున్న కేంద్రాలతోపాటు మిగతా కేంద్రాల్లో కొనుగోలు చేసిన ట్రక్ షీట్లు ఇవ్వాలని కోరాం. అవి వస్తే విచారణ చేసి వాస్తవం ఏమిటనేది తేలుస్తాం. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల సమాచారం మా దగ్గర లేదు. బుధవారం వరకు తెప్పించుకొని పరిశీలిస్తాం.
>
> – బాలకృష్ణ, ఏపీఎం, గండేడ్

వేంకటేశా.. నమోస్తుతే



కోటకదిరలో అళహరి వంశీయుల ఇంటి నుంచి స్వామివారిని తీసుకెళ్తున్న భక్తులు

- మన్యంకొండ బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- కోటకదిర నుంచి గుట్టపైకి స్వామివారి సేవ



స్వామివారి ఉత్సవ మూర్తి

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం దేవస్థానం సమీపంలోని కోటకదిరలో ఉన్న చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ స్వగృహం నుంచి స్వామివారిని ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న మన్యంకొండ గుట్టపైకి పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. సన్నాయి, బ్యాండ్ వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామస్మరణ మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. గ్రామ పురవీధుల గుండా స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కోలాటాలు, భజనలు చేశారు. దీంతో కోటకదిర భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. కాగడాల వెలుతురులో స్వామివారు ధగధగమెరిసిపోతూ పల్లకీలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. స్వామివారిని కోటకదిర నుంచి ఘాట్ రోడ్డు గుండా దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు.

స్వర్ణాభరణాలంకరణలో స్వామివారు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం తెల్లవారుజామున ముందుగా స్వామివారిని వివిధ బంగారు ఆభరణాలతో అలంకరించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం, నివేదన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో దేవస్థానంలోని గర్భగుడిలో స్వామివారు స్వర్ణాభరణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హారతి దీపాల వెలుతురులో కనిపించిన స్వామివారి దృశ్యాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మన్యంకొండకు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు హంసవాహన సేవ

మన్యంకొండ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం రాత్రి స్వామివారికి హంసవాహన సేవ నిర్వహించనున్నారు.

వైభవంగా తిరుచ్చిసేవ..

ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి దేవస్థానంలో స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వారం రోజులపాటు దేవస్థానంలో ప్రతిరోజు రాత్రి పలు సేవా కార్యక్రమాలు జరిపిస్తారు. ఇందులో భాగంగానే మొదటిరోజు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెండి పల్లకీలో స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు చేసి మళ్లీ గర్భగుడి వద్దకు తీసుకెళ్లారు. తిరుచ్చిసేవలో స్వామివారు బంగారు ఆభరణాలు, వివిధ పూల అలంకరణలో ధగధగ మెరిసిపోతూ దేవస్థానం ఆవరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో రైతుబంధు మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ రమ్య, దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయ అభివృద్ధికి సహకరించండి

జోగుళాంబ శక్తిపీఠం: కేంద్ర పురాతత్వ శాఖ పరిధిలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం, ఆలయ అభివృద్ధికి కేంద్ర సహాయం అందించాలని ఆలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఈఓ పురందర్‌కుమార్, ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఆలయాల ప్రాంగణంలో వెలుతురు కోసం ఎంపీ నిధుల నుంచి రెండు హైమాస్ట్ లైట్లు రాగా వాటిని ఆలయ పరిసరాలలో పెట్టేందుకు కేంద్ర పురాతత్వ శాఖ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పుష్కరఘాట్ ముందు ఖాళీగా ఉన్న ఆర్కియాలజికల్ స్థలం దేవస్థానానికి ఇస్తే అక్కడ యాత్రికుల కోసం తాత్కాలిక షెడ్‌తో అధునాతన అన్నదాన భవనం నిర్మాణం చేస్తామని పేర్కొన్నారు. నవబ్రహ్మ ఆలయాలను డెడ్ మాన్యుమెంట్‌లో తొలగించి దేవస్థానాన్ని అప్పచెబితే జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయం తరహాలో అన్ని ఆలయాల్లో అర్చకులు, మరియు ఇతర సిబ్బందిని నియమించి నిత్యపూజలు చేసేందుకు వీలవుతుందని తెలిపారు. ఇందుకు బండి సంజయ్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ శాంతకుమారి, మరియు ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సతీమణి శోభను, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసినట్లు తెలిపారు. ఆలయానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సహకారం కోరుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వారందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ, ఆలయ కమిటీ మాజీ ధర్మకర్త నరసింహారెడ్డి ఉన్నారు.



బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఈఓ, చైర్మన్



ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సతీమణిని కలిసిన చైర్మన్, ఈఓ